# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 08 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## శ్రీశైలంలో నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

- 11 రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు



**బలగం టీవీ, శ్రీశైలం**

ఏపీలోని నంద్యాల జిల్లా శ్రీశైలంలో కొలువైన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఫిబ్రవరి 8(నేటి) నుంచి 18వ తేదీ వరకు 11 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సుమారు 30 శాతం మంది భక్తులు అధికంగా శ్రీశైలం క్షేత్రానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంచనాలకు అనుగుణంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 8న ఉదయం శ్రీ స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 9వ తేదీ నుంచి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి వివిధ వాహన సేవలు, గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 12న రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

## ప్రపంచానికి భారత్ విశ్వసనీయ భాగస్వామి

### నమ్మకం భారత్‌కు బలమైన కరెన్సీగా మారింది : ప్రధాని మోదీ



**బలగం టీవీ, కౌలాలంపూర్**

ప్రపంచ దేశాలు భారత్‌ను తమ అభివృద్ధిలో ఒక నమ్మకమైన భాగస్వామిగా భావిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నమ్మకం అనేది నేడు భారత్‌కు అత్యంత బలమైన కరెన్సీగా మారిందని ఆయన స్పష్టం చేశారు. రెండు రోజుల మలేసియా పర్యటనలో భాగంగా శనివారం కౌలాలంపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇటీవల యూకే, యూరోపియన్ యూనియన్, అమెరికా, యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్ వంటి దేశాలతో కుదిరిన వాణిజ్య ఒప్పందాలే ప్రపంచానికి భారత్‌పై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. గతంలో భారత్‌ను కేవలం పెద్ద మార్కెట్‌గా చూసిన ప్రపంచం, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి కేంద్రంగా భావిస్తోందని పేర్కొన్నారు.

**రైతులు, స్టార్టప్‌లకు లాభం**

అమెరికాతో కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం భారత రైతులు, స్టార్టప్‌లు, మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచుతుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతీయ భాషలు, మలేసియా అధికారిక భాష అయిన మలయ్ మధ్య అనేక ఉమ్మడి పదాలు ఉండటం రెండు దేశాల మధ్య ఉన్న లోతైన సాంస్కృతిక అనుబంధాన్ని సూచిస్తుందని చెప్పారు.

భారత సంతతి ప్రజలు ఉన్న రెండో అతిపెద్ద దేశం మలేసియానేనని మోదీ తెలిపారు. "మనం కొచ్చిలో ఉన్నా, కౌలాలంపూర్‌లో ఉన్నా రోటీ కెనై (మలబార్ పరోటా), కొబ్బరి, సుగంధ ద్రవ్యాలు, తెహ్ తారిక్ రుచులు మనల్ని ఏకం చేస్తాయి" అంటూ ఇరు దేశాల సాంస్కృతిక సారూప్యతను గుర్తుచేశారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో తనకు పాత స్నేహం ఉందని, ఆయన భారతీయ సంగీతానికి పెద్ద అభిమాని అని మోదీ సరదాగా వ్యాఖ్యానించారు. ఇరు ప్రధానులు ఒకే కారులో ప్రయాణించి కార్యక్రమానికి రావడం ద్వైపాక్షిక సంబంధాల్లో ఉన్న సాన్నిహిత్యానికి నిదర్శనమని అన్నారు. మలేసియాలోని తమిళ సమాజం శతాబ్దాలుగా ఆ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని కొనియాడారు. భారత ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న తమిళనాడుకు చెందిన నాయకులను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**కొత్త భారత కాన్సులేట్**

మలేసియాలో త్వరలో కొత్త భారతీయ కాన్సులేట్‌ను ప్రారంభించనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. గత ఏడాది ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు అర్హతను ఆరో తరానికి విస్తరించిన నిర్ణయాన్ని చారిత్రాత్మకమైన అభివృద్ధిగా అభివర్ణించారు. మలేసియా విద్యార్థుల కోసం భారత్‌లో చదువుకునేందుకు తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు తెలిపారు. భారత ప్రవాసుల చరిత్ర, వారసత్వాన్ని ప్రతిబింబించే పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ హెరిటేజ్ ఎగ్జిబిషన్ను కూడా ప్రధాని సందర్శించి, ఇది స్ఫూర్తిదాయకమైన నివాళి అని పేర్కొన్నారు.

## ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ల్యాబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌లో తొలుత మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని 5 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ఈ ప్రమాదంలో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయని తెలిసింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

ల్యాబ్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఏ ఏ వస్తువులు దగ్ధమయ్యాయన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదని ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైళ్లు, ఆధారాలు భద్రపరిచే ఎవిడెన్స్ లాబరేటరీ కార్యకలాపాలు ఈ భవనం నుంచే నిర్వహిస్తారని తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పనిచేస్తున్న వార్డు బాయ్ కష్ణ మంటలను ఆర్పే ప్రయత్నంలో అపస్మారక స్థితిలోకి వెళ్లగా, అతడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో ల్యాబ్‌లో నలుగురు ఉద్యోగులు ఉన్నారని, మంటలు గమనించిన వెంటనే వారు బయటకు వచ్చేశారన్నారు.

**కీలకమైన కేసుల ఆధారాలన్నీ ల్యాబ్‌లోనే...**

నాంపల్లిలో ఉన్న స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో భారీ అగ్నిప్రమాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన ఆధారాలు అగ్నికి ఆహుతి అయ్యాయని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సష్టించిన పలు కీలక కేసులకు సంబంధించి ఆధారాలు కాలి బూడిదైనట్టు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పత్యేక రాష్ట్ర ఏర్పాటయ్యాక రాజకీయ ప్రకంపనలు సష్టించిన అనేక కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు సైతం ఆ ల్యాబ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఫైల్స్ అన్నీ అగ్నికి ఆహుతైనట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో సంచలనం సష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్కులు, డిజిటల్ డేటా విశ్లేషణ ఇక్కడే జరుగుతున్నట్టు తెలుస్తోంది. వీటితోపాటు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సష్టించిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌ల ఒరిజినల్ ఫైల్స్ ఇక్కడి కంప్యూటర్లలోనే నిక్షిప్తమై ఉన్నట్టు సమాచారం. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయంగా సంచలనం రేపిన ఎమ్మెల్యేల కొనుగోలు యత్నం కేసులో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, వాటికి సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు సైతం ఇక్కడే ఉన్నట్టు తెలుస్తోంది.

## రేవంత్‌రెడ్డి జీవితం మొత్తం అవినీతిమయం

- నోట్లకట్టలతో దొరికిననాడే బేడీలు వేయాల్సింది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గోడలకు సున్నాలు వేసుకునే స్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన రేవంత్‌రెడ్డి జీవితం మొత్తం అవినీతిమయమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. నోట్లకట్టలతో దొరికిన రోజే రేవంత్‌రెడ్డికి బేడీలు వేసి ఊరేగించాల్సి ఉండేదని, కానీ కేసీఆర్ మంచోడు కాబట్టే ఆయనను అప్పట్లో వదిలిపెట్టారని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం, జిన్నారం, అలాగే సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల వీడియో క్లిప్‌లను ప్రజలకు చూపించారు.

కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఆ పథకాల్లో కోతలు పెడుతున్నారని ఆరోపించారు. నీతి, నిజాయితీ, పద్ధతి లేకుండా వయసులో పెద్దవాడైన కేసీఆర్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం రేవంత్‌రెడ్డికి తగదని హితవు పలికారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి తెలంగాణ ప్రజలు నేడు సిగ్గుపడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ మనోడు కాదని రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చంద్రబాబు కాళ్ల దగ్గర ఉన్న రేవంత్‌రెడ్డి, ఆంధ్రోళ్లకు సద్దులు మోసిన తెలంగాణ ద్రోహి అని విమర్శించారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ నీళ్లను ఒడిసి పట్టి తెలంగాణకు అందిస్తే, రేవంత్‌రెడ్డి మాత్రం ఆంధ్రకు నీళ్లను పంపే కుట్ర చేస్తున్నారని అన్నారు. తమ పథకాలపై ప్రశ్నిస్తే లేనిపోని కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా ఇచ్చిన హామీలను అమలు చేసే దాకా ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు.

**బీజేపీకి ఓటేసినా మోరీలో వేసినట్టే**

ప్రజలకు ఏం చేసిందని బీజేపీ ఓట్లు అడుగుతోందని ప్రశ్నించిన హరీశ్‌రావు.. ప్రజలు తమ ఓటును బీజేపీకి వేసినా, మోరీలో వేసినా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమస్యలపై పోరాటం చేయవచ్చని అన్నారు.

మిషన్ కాకతీయలో రూ.55 వేల కోట్ల అవినీతి జరిగిందని బీజేపీ ఎంపీలు మాట్లాడటం హాస్యాస్పదమని చెప్పారు. అసలు మిషన్ కాకతీయకు ఖర్చు పెట్టిందే రూ.5 వేల కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.84 వేల కోట్లు ఖర్చు చేస్తే, లక్ష కోట్ల అవినీతి చేశారని బద్నాం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. బీజేపీ ధరలు పెంచడం తప్ప పేదలకు ఏమీ చేయలేదని విమర్శించారు. రూ.15 లక్షలు ఇస్తామని చెప్పి 12 ఏళ్లు గడిచినా ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. పువ్వు గుర్తుకు ఓటేసినా, మోరీలో ఓటు వేసినా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలన్నా, తెలంగాణ అభివృద్ధి చెందాలన్నా కారు గుర్తుకే ఓటు వేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గుమ్మడిదలలో గులాబీ జెండా ఖాయమైందని, గడ్డపోతారంలోనూ ప్రజల ఆశీర్వాదం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, పాల సాయిరాం, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ, ప్రకాశ్‌చారి, రాజేశ్, పాండురంగారెడ్డి, విక్రంరెడ్డి, కల్పన తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి రాధాకృష్ణశర్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, దేవి రవీందర్, మధు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

### చీకటి ఒప్పందాలే

# బీజేపీ-బీఆర్ఎస్ రాజకీయాలు

- కేసీఆర్ నిర్లక్ష్యంతో ప్రాణహిత--చేవెళ్ల అటకెక్కింపు
- 'కాళేశ్వరం' మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'
- లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు వేగవంతం
- 1.50 లక్షల ఎకరాలకు కృష్ణా జలాలు
- అప్పా జంక్షన్--మన్నెగూడ రోడ్డు పనులు తిరిగి ప్రారంభం
- రీజనల్ రింగ్ రోడ్డుతో వికారాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు
- గోదావరి జలాలతో తాండూరు, పరిగి, వికారాబాద్‌లను సస్యశ్యామలం చేస్తాం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**బలగం టీవి, వికారాబాద్**

వికారాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన--ప్రగతిబాట బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద చెక్కులను పంపిణీ చేశారు. సభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పిదాలను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ--ఫామ్‌లను బీఆర్ఎస్ కార్యాలయాల నుంచే తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా, ఢిల్లీలో కూర్చున్న పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఎందుకని ప్రజలను ప్రశ్నించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలు అందించి ఉంటే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవని, కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిధులతో కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు, వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని హామీ ఇచ్చారు.

జిల్లా అభివృద్ధికి సంబంధించి సీఎం పలు కీలక ప్రకటనలు చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణను త్వరలో పూర్తి చేసి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ రోడ్డు పూర్తి కాకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టాలకు కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిలే బాధ్యులని విమర్శించారు. కోర్టు కేసులను పరిష్కరించి ప్రస్తుతం ఆ రోడ్డు పనులను వేగవంతం చేశామని తెలిపారు. భవిష్యత్తులో రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు రాబోతున్నాయని, వికారాబాద్ త్వరలోనే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్ చరిత్రను చెరిపేయాలని తాను ప్రయత్నిస్తున్నానన్న కేటీఆర్, హరీష్ రావుల వ్యాఖ్యలకు సీఎం ఘాటుగా స్పందించారు. దొంగ పాస్‌పోర్టులు, దొంగ నోట్ల వ్యవహారాలు, దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర తెలంగాణ ఉన్నంతకాలం చెరిగిపోదన్నారు. ఆ చరిత్రను ప్రజలకు గుర్తుండేలా చేయడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏమి చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేశామని గుర్తు చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విషం చిమ్మే పాములకు మళ్లీ పాలు పోయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

గోదావరి జలాల ద్వారా తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులతో పాటు అవసరమైన ప్రణాళికలను చేపడుతామని ప్రకటించారు. తాండూరు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు కాగ్నా నది నుంచి మంచినీటిని అందించే కార్యక్రమాలను పూర్తి చేస్తామని చెప్పారు. సంవత్సరం తిరిగేలోపు అప్పా జంక్షన్ నుంచి మన్నె గూడ, అక్కడి నుంచి తాండూరు వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్, అలాగే రేడియల్ రోడ్లను పూర్తి చేస్తామని, రాబోయే రోజుల్లో వికారాబాద్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారబోతోందన్నారు. అనేక సమస్యలను అధిగమిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, ప్రజలంతా సహకరించాలని కోరారు. తెలంగాణలో ప్రధానంగా రైతాంగం, నిరుద్యోగ యువత, మహిళలు ప్రాధాన్యంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెబుతూ ముఖ్యమంత్రి గారు వాటిని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గవికారాబాద్ జిల్లాలోని 6,650 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి కింద 567.69 కోట్ల రూపాయల చెక్కును మహిళా ప్రతినిధులకు అందజేశారు. ఈ బహిరంగ సభలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ. 85 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- 7 వేల గజాల పార్కులకు హైడ్రా ఫెన్సింగ్




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా, ఉప్పల్ మండలంలోని వెర్వేరు ప్రాంతాల్లో 7 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాలను హైడ్రా శనివారం కాపాడింది. వ్యవస్థలను మేనేజ్‌చేసుకుంటూ కబ్జాలకు పాల్పడిన వారి ఆటలకు అడ్డుకట్ట వేసింది. 1980లో 183 ప్లాట్లతో బాబానగర్ కాలనీ లే ఔట్‌ను వేశారు. ఇందులో 3 వేల గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. 1999 వ సంవత్సరం వరకూ ఇది పార్కుగానే కొనసాగింది. కాప్రా సర్కిల్ వారు ఈ మేరకు హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. కాని తర్వాత ఆ లే ఔట్‌లో 183 ఉన్న ప్లాట్ల సంఖ్య 189కి పెరిగిపోయింది. మొత్తం 3 వేల గజాలను 500ల గజాల చొప్పున 6 ప్లాట్లుగా మార్చేశారు. ఇలా పార్కునే ప్లాట్లుగా చేసి అమ్మిన ప్లాట్లలో 188వ ప్లాట్ కొన్న బొట్ల సాయి తర్వాత కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడయ్యాడు. 500ల గజాల ప్లాట్‌లో 266 గజాల మేర బొట్ల సాయి ఇల్లు కట్టుకున్నాడు. మిగిలిన 234 గజాల స్థలాన్ని ఖాళీగా ఉంచాడు. 188 ప్లాట్‌కు పక్కన ఉన్న రహదారి స్థలాన్ని కూడా కబ్జా చేస్తూ బై నంబర్లు వేసి బొట్ల సాయి 50 గజాల చొప్పున మరో 6 ప్లాట్లు చేసి అమ్మాడంటూ మొత్తం ఉదంతంపై అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 3 వేల గజాల పార్కును కాపాడాలంటూ విజ్ఞప్తి చేశారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు జీహెచ్ ఎంసీ, రెవెన్యూ అధికారులతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 3 వేల గజాలు పార్కుకు కేటాయించినట్టు నిర్ధారించుకున్నారు. ఇప్పటికే కొన్ని నివాసాలు రాగా.. మిగిలిన 2 వేల గజాల స్థలాన్ని పరిరక్షిస్తూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అలాగే ఉప్పల్ మండలం నాచారం గ్రామంలోని కార్తికేయ నగర్‌లో కూడా 3 ఓపెన్ ప్లేస్‌లతో పాటు.. పార్కులకు కేటాయించిన 5 వేల గజాలను హైడ్రా శనివారం కాపాడింది. పార్కు స్థలాలను కాపాడిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నికల ఫిర్యాదుల పరిష్కారానికి క్లస్టర్ నోడల్ అధికారులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంతో పాటు అభ్యర్థులు, ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం (టీజీఎస్ఈసీ) క్లస్టర్లవారీగా నోడల్ అధికారులను నియమించింది. ఈ మేరకు ఎస్ఈసీ కార్యదర్శి జీ.లింగ్యానాయక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికల ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం నోడల్ అధికారుల ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. ఎన్నికలు నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత కూడా వారిదేనని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల నిర్వహణకు నియమితులైన అధికారులకు శనివారం వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, విధివిధానాలపై వారికి అవగాహన కల్పించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 92475 97066ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సోమవారం నుంచి ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అధికారులు ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించనున్నారు.

## బెల్లంపల్లి గురుకులంలో ఫుడ్ పాయిజన్ కలకలం


- ఆహారం తిని 20 మంది విద్యార్థులు అస్వస్థత

**బలగం టీవి, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాత్రి భోజనం చేసిన అనంతరం 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులకు వాంతులు, విరేచనాలు రావడంతో ఫుడ్ పాయిజన్ జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వసతి గృహంలో భోజనం చేసిన కొద్దిసేపటికే విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే బాధిత విద్యార్థులను బెల్లంపల్లి పట్టణంలోని కెమికల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించగా, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. గురుకుల పాఠశాలల్లో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు ప్రభుత్వ వైఖరిని ప్రతిబింబిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణమని వారు విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుని విద్యార్థులు ఆసుపత్రుల్లో చేరిన సంఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ, పరిస్థితిలో మార్పు రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. తాజా ఘటనతోనైనా ప్రభుత్వం స్పందించి గురుకుల పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు

# కాంగ్రెస్ మోసానికి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పండి..

- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయడం అంటే మోరిలో వేసినట్లే..
- చేయి గుర్తుకు ఓటు వేయడం అంటే వారి మోసానికి హామీల వైఫల్యానికి ఓటు వేసినట్లే
- 11న కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ కి బుద్ధి చెప్పండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వేములవాడ, సిరిసిల్లలో కేటీఆర్ ఎన్నికల ప్రచారం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం అంటే వారి ప్రజా వ్యతిరేక విధానాలకు, ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యానికి, మరియు వారు చేసిన 420 వాగ్దానాల మోసానికి మద్దతు ఇవ్వడమేనని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మొండి వైఖరిని వీడాలంటే, ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ ప్రచారంలో భాగంగా వేములవాడ మరియు సిరిసిల్ల ప్రాంతాల్లో పర్యటించిన కేటీఆర్, ఈ నెల 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని ఇప్పుడే అడ్డుకోకపోతే, ఆ పార్టీ మరింత రెచ్చిపోయి ప్రజలను పీడిస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే అవినీతి, అక్రమాలు మరియు స్కాములతో ఆ పార్టీ ప్రతిష్ఠ మసకబారిందని ఆయన విమర్శించారు. అదేవిధంగా, భారతీయ జనతా పార్టీపై కూడా ఆయన మండి పడుతూ, బీజేపీకి ఓటు వేయడం అంటే అది వృథా చేయడమేనని, మీ ఓటు మోరిలో వేసినట్లే అన్నారు. ఆ పార్టీ కేవలం ఎన్నికల సమయంలోనే కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు కులమతాల పేరుతో ఓట్లు వేయించుకొని, ఒట్టు పెట్టించుకుని పదవులు పొంది మాయమవుతుందన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై విమర్శలు చేస్తూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు లేదా తెలంగాణ రాష్ట్రానికి ఆయన సాధించిందేమీ లేదని కేటీఆర్ అన్నారు. గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదని, సిరిసిల్ల నేతన్నలు ఎంతో కాలంగా కోరుతున్న మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకువచ్చే శక్తి ఆ పార్టీకి లేదని విమర్శించారు. బీజేపీ కేవలం కులమత రాజకీయాలకే పరిమితమైందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలను మోసం చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళలకు ఇస్తామన్న నెలకు 2500 రూపాయలు మరియు 400 రూపాయల పెన్షన్ వంటి హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరల తయారీని రద్దు చేసి నేతన్నల ఉపాధిని దెబ్బతీశారని, నేతన్నలను అవమానపరిచేలా మాట్లాడిన కాంగ్రెస్ నేతలకు ఈ ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పాలని ప్రజలను కోరారు. నేతన్నల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వారిని కండోమ్స్ అమ్ముకోండి...పాపడాలు అమ్ముకోండి అంటూ నీచమైన మాటలు మాట్లాడిన కాంగ్రెస్ నేతలకు చెప్పుతో కొట్టినట్లు ఎన్నికల్లో సమాధానం చెప్పాలన్నారు. చివరగా, సిరిసిల్ల జిల్లాను రద్దు చేస్తానని రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే జిల్లా ఉనికికే ప్రమాదమని కేటీఆర్ హెచ్చరించారు. మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చే కొద్దిపాటి డబ్బులకు లోబడకుండా, మన సొంత పార్టీ అయిన భారత రాష్ట్ర సమితిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా సమన్వయం చేసుకోవాలి..



- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన మున్సిపల్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు .మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ విధులపై ఆర్ఓలు, ఏఆర్ఓలు, కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సిరిసిల్ల, వేములవాడలోని సీ నారాయణ రెడ్డి కళామందిరంలో కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, కౌంటింగ్ రోజున ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కించాలని సూచించారు. అనంతరం వార్డుల వారీగా ఓట్లు లెక్కించాలని, రౌండ్ల వారీగా పూర్తి అయిన తర్వాత ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న అధికారులకు మినహా ఎవరికీ మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకువెళ్ళ కూడదని స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు.ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకా లను తూచా తప్పకుండా పాటిస్తూ లెక్కింపు జరిగేలా చూడాలని అన్నారు. సంబంధిత రిపోర్ట్ లు ఎప్పటి కప్పుడు పంపాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది తమకు నిర్దేశించిన విధుల పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించలని, అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ట్రైనర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అగ్రహారం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు

- రూ. 2 లక్షల నగదు స్వాధీనం..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, జిల్లా పోలీసు యంత్రాంగం నిఘాను కట్టుదిట్టం చేసింది. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున, శనివారం ఉదయం అగ్రహారం వద్ద ఉన్న SST (Static Surveillance Team) చెక్‌పోస్ట్‌లో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు.శనివారం ఉదయం సుమారు 10:34 గంటల సమయంలో, జగిత్యాల నుండి సిరిసిల్ల వైపు వెళ్తున్న యా 21 5555 నంబర్ గల కారును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కారులో తరలిస్తున్న లెక్క చూపని మరియు అనుమానాస్పద నగదు రూ. 2,00,000/- (రెండు లక్షల రూపాయలు) గుర్తించబడింది. నిందితుడు కారు డ్రైవర్/యజమాని అనందుల శ్రీనాథ్, తండ్రి: మురళి, నివాసం జగిత్యాలగా గుర్తించడం జరిగింది. సదరు వ్యక్తి ఈ నగదుకు సంబంధించి ఎలాంటి అధికారిక పత్రాలు చూపకపోవడంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికల నిబంధనల ప్రకారం, ఎస్ఎస్‌టీ బృందం ఇన్‌చార్జ్ మరియు వీూఉ మీర్జా అఫజల్ అహ్మద్ బేగ్ పంచుల సమక్షంలో (పంచనామా) ఈ నగదును సీజ్ చేశారు. ఈ నగదును ఎక్కడి నుండి తీసుకువస్తున్నారు? దేనికోసం తరలిస్తున్నారు? అనే విషయాలపై తదుపరి విచారణ కొనసాగుతోందని సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కే. కృష్ణ తెలిపారు.

# అభివృద్ధి దిశగా సాగుతున్న వేములవాడకు ఓటుతో బలమివ్వండి..

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ 01 వార్డు సంగ హనుమవ్వ, 02 వార్డు లింగంపల్లి జ్యోతి, 03 వార్డు గుడిసె సంతోష లకు మద్దతుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు తిరుగుతూ గత రెండు సంవత్సరాలుగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. చేతి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను ప్రభుత్వ విప్ అభ్యర్థించారు.





# సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

- మహిళ భద్రతపై విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు..
- జిల్లా షీ టీమ్.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచనల మేరకు జిల్లా షీ టీమ్ ప్రతి రోజూ విద్యాసంస్థలు, మహిళలు పని చేసే ప్రదేశాలను సందర్శిస్తూ గుడ్ టచ్/బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో చట్టం, షీ టీమ్ సేవలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను షీ టీమ్ బృందం శనివారం రోజు సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించి, వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని , ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్న సిరిసిల్ల పట్టణ పోలీసులు..




- 19,008/- రూపాయల విలు వ గల(17.28 లీటర్ల) మద్యం, ద్విచక్ర వాహనం, ఫోన్ లు సీజ్..
- నలుగురు వ్యక్తులపై కేసు నమోదు
- మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం, డబ్బు రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు.
- సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ

**బలగం టీవీ, సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తరలిస్తున్న అక్రమ మద్యాన్ని సిరిసిల్ల పట్టణ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి రూ. 19,008 విలువైన మద్యం, ఒక ద్విచక్ర వాహనం మరియు ఫోన్‌ను సీజ్ చేసి, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, పట్టణంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో మద్యం పంపిణీ జరుగుతోందన్న సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రాచమల్లు రాము అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై రాయల్ స్టాగ్ విస్కీ (180 మీ) కి చెందిన 96 సీసాలను తరలిస్తూ పట్టుబడ్డాడు. దార్నం అరుణ, దార్నం లక్ష్మినారాయణ, మల్లికార్జున వైన్స్ పాత బస్టాండ్, రాచమల్లు రాము (మద్యం తరలిస్తున్న వ్యక్తి) లు నిందితులని తెలిపారు

విచారణలో, ఈ మద్యం సీసాలను 5వ వార్డు నుండి బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి దార్నం అరుణ, ఆమె భర్త దార్నం లక్ష్మినారాయణ ఆదేశాల మేరకు ఓటర్లకు పంచడానికి తీసుకువెళ్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడన్నారు. మద్యం 96 రాయల్ స్టాగ్ విస్కీ సీసాలు (17.28 లీటర్లు) -- విలువ సుమారు రూ. 19,008/-, వాహనం మోటార్ సైకిల్ నెం TS 23 A 6196, ఒక స్మార్ట్ ఫోన్ లను సీజ్? చేశామని వెల్లడించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, డబ్బు లేదా ఇతర వస్తువులను పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సిరిసిల్లలో ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజితఆ ధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ నిర్వహించారు. తనిఖీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన సర్టిఫికెట్లను పరిశీలించి, డాక్టర్ల వివరాలు మరియు మరియు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు సమర్పించ వలసిందిగా తెలుపుతూ ట్రైనింగ్ అయినా స్టాఫ్ నర్స్ మరియు కనీస వసతులు ఏర్పాటు చేయవలసిందిగా ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులకు సూచించినారు. ఈ కార్యక్రమంలో మహేష్, సాగర్ లు పాల్గొన్నారు.



# గాలిపల్లి హై స్కూల్‌కు మినీ ఆర్ఓ ప్లాంటును వితరణ చేసిన ఉప సర్పంచ్ శ్రీకాంత్

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం గాలిపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మినీ ఆర్ ఓ ప్లాంట్ ను గ్రామ ఉప సర్పంచ్ రావుల శ్రీకాంత్ గౌడ్ వితరణ గా అందజేశారు. స్కూల్లో గత కొద్ది నెలలుగా ఇది వరకు వున్న ఆర్ ఓ పూర్తిగా చెడిపోయింది.పాఠశాలలో విద్యార్థుల మంచి నీటి కి స్వంత ఖర్చుతో బిగింపు చేసి సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మేకల పావని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బట్టు పద్మ శ్రీనివాస్ లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ను కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఉపాధ్యాయ బృందం, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# ఇల్లంతకుంట యువజన సంఘాల అధ్యక్షుడిగా రేగుల కార్తీక్

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో నిర్వహించిన యువజన సంఘాల సమావేశంలో రేగుల కార్తీక్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు రేగుల కార్తీక్ మాట్లాడుతూ.. యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేసి యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. గ్రామంలో క్రీడలు, సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టి యువతను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, యువకులు పాల్గొని కార్తీక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికైన అధ్యక్షుడిని సర్పంచ్ ఎం రాజు, మాజీ అధ్యక్షుడు ఉప్పల అమరేందర్, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు

# రాష్ట్రస్థాయిలో మెరిసిన ఇల్లంతకుంట విద్యార్థిని..

- రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానం సాధించిన రహీంఖాన్ పేట్ మోడల్ స్కూల్ విద్యార్థిని



**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్ట్ లో ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్ పేట్ మోడల్ స్కూల్ విద్యార్థిని మహిత ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఎన్?.మహిత ను, ప్రోత్సహించి మార్గదర్శకం చూపించిన ఉపాధ్యాయులు ఎల్ రాజు, జి రాజు లను సాంఘిక శాస్త్ర ఫోరం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డి రవి, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ లు అభినందనలు తెలియజేశారు.

# పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి..

- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రం పరిశీలన

**బలగం టీవీ, సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విధులకు హాజరయ్యే వారు పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



శనివారం పరిశీలించారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్ కోసం సిద్ధం చేసిన ఫారాలను పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, 8వ తేదీ ఆదివారం కూడా ఓటు హక్కు వినియోగించుకో వచ్చని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కునేవారు సంబంధిత ఫారాలు అన్ని జత చేసి తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో నోడల్ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ పుడితే బ్యాంకులో 10 వేలు డిపాజిట్..

- అద్భుతమైన హామీలతో బీజేపీ అభ్యర్థి మహంకాళి ప్రచారం
- 21వ వార్డులో మారుతున్న రాజకీయ సమీకరణలు

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని 21వ వార్డులో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి.ఈ వార్డులో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న మహంకాళి శ్రీనివాస్ గౌడ్ కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అద్భుతమైన హామీలతో ఆయన ప్రజలను ఆకర్షిస్తున్నారు. తనదైన శైలిలో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా 21వ వార్డులో ప్రజలు ఓటు వేసి తనను కౌన్సిలర్ గా ఎన్నుకున్న తర్వాత వార్డులో ఆడబిడ్డలు పుడితే వారి పేరు మీద పోస్ట్ ఆఫీసులో 10 వేలు డిపాజిట్ చేసి వారి తల్లిదండ్రులకు బాండ్ అందజేస్తానని కరపత్రం ముద్రించి ప్రచారం చేస్తున్నారు. దీనితో పాటు వార్డులో మౌలిక వసతులు, సీసీ రోడ్లు, పారిశుద్యం, హైమాక్స్ లైట్లు, నిరంతరం సీసీ కెమెరాలు, అన్ని రకాల పింఛన్లు,ప్రభుత్వ పథకాలు అందజేస్తానని తెలియజేస్తున్నారు.

ప్రతినిత్యం ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయనకు ప్రజలు నీరాజనాలు పలుకుతూ, నుదుటన తిలకం దిద్ది మంగళ హారతులతో ఆశీర్వదిస్తున్నారు. మహంకాళి అమ్మవారి భక్తుడిగా పేరుగాంచిన శ్రీనివాస్ గౌడ్ గత ఎన్నో సంవత్సరాలుగా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. కల్మషం లేని మనసుతో అపద ఎక్కడ ఉంటే అక్కడ శ్రీనివాస్ గౌడ్ ఉంటాడనే పేరు ఆయనకు ఉంది. గతంలో రెండు సార్లు ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ,ప్రజలకు దూరం కాకుండా వారి మధ్యే ఉంటూ, ప్రజా సమస్యలపై పోరాడుతూ వచ్చిన నాయకుడిగా ఆయన నిలిచారు. ఓటమిని నిరాశగా కాకుండా అనుభవంగా మలుచుకుని, మరింత బలంగా ప్రజల కోసం ముందుకు సాగుతున్నారు.ప్రత్యేకించి యువతలో మహంకాళి శ్రీనివాస్ గౌడ్‌కు మంచి క్రేజ్ ఉంది.యువతకు ఉపాధి,



అభివృద్ధి, స్వచ్ఛమైన రాజకీయాలపై ఆయన చూపిస్తున్న దృక్పథం ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది.కేంద్ర మంత్రి బండి సంజయ్ అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకుడిగా ఆయన ప్రచారం కొనసాగుతోంది. దీనికి తోడు పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చెన్నమనేని వికాస్ రావు,జిల్లా అధ్యక్షుడు రెడ్డవేని గోపి, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ లు ప్రచారంలో ఆయనకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఈసారి మహంకాళి శ్రీనివాస్ గౌడ్ విజయం సాధిస్తారనే నమ్మకం బీజేపీ శ్రేణుల్లో కనిపిస్తోంది. 21వ వార్డులో మారుతున్న ఈ రాజకీయ సమీకరణలు రాబోయే ఎన్నికల్లో ఆసక్తికర ఫలితాలకు దారి తీయనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలందరికి అప్పుడిగా పేరు గాంచిన మహంకాళి శ్రీనివాస్ గౌడ్ ఎన్నికల ప్రచారంలో తనదైన శైలిలో ముందుకు దూసుకుపోతున్నారు. ముఖ్యంగా వార్డులోని మహిళలు తనను స్వంత బిడ్డలాగా ఆదరిస్తున్నారు. ఈ నెల 11న నిర్వహించే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలందరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి 21 వార్డు బీజేపీ కౌన్సిలర్ గా భారీ మెజారిటీ తో గెలిపించాలని మహంకాళి శ్రీనివాస్ గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆ మూడు పార్టీలు ప్రజలను దోచుకోవడంలో దోస్తులే..

- ఎన్నికల ప్రచార క్యాంపెయిన్ లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు
- మున్సిపాలిటీలో ప్రశ్నించే గొంతుక సిపిఎం అభ్యర్థులను గెలిపించండి..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ మూడు పార్టీలు ప్రజలను దోచుకోవడంలో దోస్తులేనని, మున్సిపాలిటీలో ప్రశ్నించే గొంతుక సిపిఎం అభ్యర్థులకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల క్యాంపేయన్ లో భాగంగా శనివారం రోజున సిరిసిల్ల పట్టణంలోని 21, 33, 34 వార్డులలో జరిగిన సిపిఎం అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ జరిగిన ప్రచార క్యాంపెయిన్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.




ఈ సందర్భంగా టీ. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. సిరిసిల్ల మున్సిపాలిటీలో కమ్యూనిస్టులు లేని లోటు వల్ల ఆ మూడు పార్టీలు ప్రజాధనాన్ని కొల్లగొట్టుకు తిన్నాయని చెప్పారు. ప్రశ్నించే గొంతుకలు ప్రజా ఉద్యమాలు నేర్పించే ఎర్రజెండా లేని లోటు గత మున్సిపాలిటీలో ఏర్పడిందన్నారు. సిపిఎం ఎర్రజెండా ఉద్యమించిన ఫలితం గానే సుందరయ్య నగర్, బి వై నగర్ లలో పేదలకు నిలువ నీడ కల్పించబడిందన్నారు. ప్రజలకు గూడు నీడ కల్పించిందని చెప్పారు. మురికి కంపు కొడుతున్న పారిశుధ్యాన్ని గత పాలకులు పట్టించుకోలేదన్నారు. సిపిఎం పవర్ లూంలోని ఆసాములు కార్మికుల కూలి రేట్ల కోసం పోరాడి



విజయం సాధించిన చరిత్ర సిపిఎం దేనని చెప్పారు. డబుల్ బెడ్ సాధన కోసం బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం కృషి చేసిందన్నారు. ఓట్ల సమయంలో లక్షలు పెట్టి ఓట్లు కొనడానికి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు జాతర జరిపి ఆ తరువాత ప్రజాదనాన్ని లూటి చేస్తున్నారని విమర్శించారు. సిపిఎం ప్రజపాలన ఆదర్శ పాలన అందిస్తుందని చెప్పారు. మున్సిపాలిటీలో సిపిఎం అభ్యర్థులు 21వ వార్డు సిపిఎం అభ్యర్థి కోడం రమణ, 33వ వార్డు సిపిఎం అభ్యర్థి ఎలిగేటి రాజశేఖర్, 34వ వార్డు సిపిఎం అభ్యర్థి రాపెల్లి రమేష్ లను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి జవ్వాజి విమల, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రవల్లి నాగరాజు, గురిజాల శ్రీధర్, సూరం పద్మ తో పాటు సిపిఎం సీనియర్ నాయకులు మిట్టపల్లి రాజమల్లు, రజిత, నక్క దేవదాస్, పోచమల్లు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళను వేధించిన కేసులో ఒక వ్యక్తికి రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మహిళను వేధించిన కేసులో ఒక వ్యక్తికి రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు 6000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కే. కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సుభాష్ నగర్ కు చెందిన ఒక మహిళ యొక్క భర్త బతుకుదెరువు నిమిత్తం సౌదీ దేశంలో పోయినాడు ఆమెకు ఇద్దరు కూతుర్లు ముగ్గురు కుమారులు సంతానం కాగా తన కులానికి చెందిన ఎండి మజీద్ అను అతను తనపై దురుద్దేశంతో ఇబ్బందులకు గురి చేశాడని తను ఎటు పోయిన వెంబడించడం రకరకాల ఫోన్ నెంబర్ల నుండి ఫోన్ చేసి మాట్లాడడం మరియు వేధింపులకు గురి చేయడం చేయగా తన కుల పెద్ద మనుషుల కు చెప్పగా అందుకు అతన్ని మందలించగా అతడు కొద్ది రోజులు ఊరుకున్నాడు. కొద్ది రోజులు మంచిగానే ఉండి మళ్ళీ పాతవిధాంగానే తనపై దురుద్దేశంతో వెంబడించడం తనతో ఫోన్లో మాట్లాడాలని తన కోరికలు తీర్చాలని వేధింపులకు గురిచేయుచు తేది. 22. 2.2021 నాడు బీడీల కంపెనీకి వెళ్ళుచుండగా సుభాష్ నగర్ సిరిసిల్లలోని ఇళ్ళ లక్ష్మీనారాయణ ఇంటి ఎదురుగా మజీద్ వెంబడించి తన చెయ్యి పట్టుకుని లాగి తనతో ఫోన్ మాట్లాడాలని అతను చెప్పినట్లు విని అతని కోరికలు తీర్చాలని లేకపోతే చంపుతానని బెదిరించినాడని తన యొక్క పరువు తీసినాడని సుభాష్ నగర్ కు చెందిన ఒక మహిళ సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై అయినా జి.సుధాకర్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితుడు ఆయన ఎండి.మజీద్ సన్నాఫ్ యూసఫ్ అను అతన్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. అనంతరం ఎస్ఐ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసినారు తర్వాత సీఎంఎస్ ఎస్ఐ.శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఏడు (7)మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టినారు ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించగా కేసు పూర్వకరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఏ ప్రవీణ్ నేరస్తుడు అయిన ఎండి.మజీద్ కు రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు 6000 రూపాయల జరిమానా విధించడం జరిగిందని సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కే కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

# బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తిపై చట్టరీత్య కఠిన చర్యలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తూ, బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ ఖ. కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ నగర్‌కు చెందిన ఆసరి ముత్యం (58), తన నివాసంలో అక్రమంగా మద్యం అమ్ముతూ బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో, గత నెల 29-01-2026 రోజున ఇతడిని ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, వచ్చే 6 నెలల వరకు ఎలాంటి చట్టవ్యతిరేక పనులు చేయనని ఫాం 13 పై సంతకం చేసి బైండోవర్ అయ్యాడు. బైండోవర్ అయిన కొద్ది రోజుల్లోనే, అనగా తేది 05-02-2026 రోజున ముత్యం మళ్ళీ తన ఇంట్లో అక్రమంగా మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిబంధనలను తుంగలో తొక్కి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు గాను, ఇతడిని శనివారం తిరిగి ఎంఆర్ఓ ముందు హాజరుపరిచినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. "ఎవరైనా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు బైండోవర్ అయ్యి, ఆ గడువు లోపు తిరిగి నేరాలకు పాల్పడితే వారిపై చట్ట రీత్య కఠిన చర్యలు ఉంటాయి. నిబంధనల ప్రకారం సదరు వ్యక్తికి లక్ష రూపాయల జరిమానా లేదా 6 నెలల జైలు శిక్ష, లేదా ఈ రెండూ విధించే అవకాశం ఉంటుంది" అని హెచ్చరించారు. పట్టణంలో అక్రమ మద్యం విక్రయాలపై నిఘా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.





# 10వ వార్డు అభివృద్ధికి 'మార్పు' నాంది..

- బీఆర్ఎస్ అభ్యర్థి మొట్టాల అనూష మహేష్ ప్రజా ప్రస్థానం
- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మట్నట్టల అనూష మహేష్ ప్రజా ప్రస్థానం

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 10వ వార్డు బీఆర్ఎస్ (దీక్షూ) అభ్యర్థి మొట్టాల అనూష మహేష్ చేపట్టిన 'ప్రజా ప్రస్థానం' పాదయాత్రకు వార్డు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇంటింటికీ వెళ్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్న అనూష మహేష్, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీలు ఇస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రచారంలో భాగంగా అనూష మహేష్ మాట్లాడుతూ.. వార్డులో ప్రధానంగా డ్రైనేజీ, పారిశుధ్యం మరియు స్ట్రీట్ లైట్ల సమస్యలు తన దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. తాను గెలిచిన వెంటనే ప్రాధాన్యత క్రమంలో ఈ సమస్యలను పరిష్కరిస్తానని, వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఓటర్లకు భరోసా ఇచ్చారు. కేవలం మౌలిక వసతులే కాకుండా రోడ్లు, తాగునీరు, అర్హులైన వారం దరికీ పెన్షన్లు అందేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. ముఖ్యంగా పేదలు, మహిళలు మరియు యువత సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా హిత పథకాలను వివరిస్తూ, కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అనూష మహేష్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో మార్పు కోరుతున్న ప్రజల ఆశలతో బీఆర్ఎస్ మరింత బలపడుతున్నట్టు ఈ ప్రచారం స్పష్టంగా చూపిస్తోంది. 10వ వార్డులో బీఆర్ఎస్ విజయానికి బాటలు వేస్తుందని ఈ సందర్భంగా నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# టీ20 ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం

- అమెరికాపై 29 పరుగుల విజయం
- బ్యాటింగ్‌లో ఆదుకున్న సూర్యకుమార్
- సత్తా చాటిన బౌలర్లు

**బలగం టీవీ, ముంబై**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు శుభారంభం చేసింది. గ్రూప్-ఏలో భాగంగా వాంఖడే స్టేడియం వేదికగా అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 29 పరుగుల తేడాతో గెలుపొందింది. అమెరికా నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైనా, సూర్యకుమార్ యాదవ్ అద్భుత బ్యాటింగ్‌తో పాటు భారత బౌలర్ల అసాధారణ ప్రదర్శనతో భారత్ విజ యాన్ని అందుకుంది. అయితే, ఈ మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ విభాగం అభిమానులను నిరాశపరిచింది.

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ 49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో అజేయంగా 84 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. మిగతా బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాక్‌విక్ 4/25తో రాణించగా, హర్మీత్ సింగ్ 2/26 వికెట్లు తీశాడు. అలీ ఖాన్, మహమ్మద్ మొహ్సిన్ తలో వికెట్ దక్కించుకున్నారు.




162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికా జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది. మిలింద్ కుమార్ (34), సంజయ్ కృష్ణమూర్తి (37) మాత్రమే కొంత పోరాటం చేశారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ 3/29తో అద్భుతంగా బౌలింగ్ చేయగా, అక్షర్ పటేల్ 2/22, అర్ష్‌దీప్ సింగ్ 2/18 వికెట్లు పడగొట్టారు. వరుణ్ చక్రవర్తి ఒక వికెట్ తీశాడు.

లక్ష్యఛేదనలో అమెరికాకు శుభారంభం దక్కలేదు. సిరాజ్ వేసిన రెండో ఓవర్‌లో ఆండ్రీస్ గౌస్ భారీ సిక్సర్ కొట్టినా, అదే ఓవర్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అర్ష్‌దీప్ సింగ్ ఓవర్‌లో కెప్టెన్ మోనాంక్ పటేల్ డకౌట్ అయ్యాడు. సిరాజ్ తన రెండో ఓవర్‌లో సాయితేజ ముక్కమల్లను ఔట్ చేయడంతో అమెరికా 13 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మిలింద్ కుమార్, సంజయ్ కృష్ణమూర్తి నాలుగో వికెట్‌కు 58 పరుగులు జోడించి పోరాటం చేశారు. ఈ భాగస్వామ్యాన్ని వరుణ్ చక్రవర్తి బ్రేక్ చేశాడు. అనంతరం అక్షర్ పటేల్ వరుస బంతుల్లో వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపుకు తిప్పాడు. చివర్లో శుభమ్ రంజన్‌ను ఆఖరి బంతికి సిరాజ్ ఎల్బీగా ఔట్ చేయడంతో భారత్ విజయాన్ని ఖాయం చేసుకుంది.




## యువ భారత్‌పై భారీ నజరానా

**బలగం టీవీ, హైదరాబాద్**

2026 అండర్ 19 వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా నిలిచిన యువ భారత్‌కు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. టోర్నీ విజేత టీమ్‌ఇండియాకు రూ.7.5 కోట్ల భారీ ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు ప్రకటన చేసింది. ఈ మేరకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. ఈ టోర్నీలో యువ భారత్ అద్భుతంగా ఆడిందని, ఒక్క ఓటమి లేకుండా ఛాంపియన్‌గా నిలవడం గొప్ప విషయమని సైకియా అభినందించారు. 'ఈరోజు ఛాంపియన్‌గా నిలిచిన అండర్ 19 జట్టును చూసి బీసీసీఐ మాత్రమే కాదు, యావత్ దేశం గర్వంగా ఉంది. మన కుర్రాళ్లు ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను మట్టికరిపించడం, టోర్నీ ఆసాంతం ఓటమే లేకుండా టైటిల్ నెగ్గడం నిజంగా మనందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా యువ జట్టుకు ప్రోత్సాహకంగా బీసీసీఐ నుంచి రూ.7.5 కోట్ల భారీ ప్రైజ్‌మనీ అందించాలని నిర్ణయించాం' అని సైకియా మీడియాతో వెల్లడించారు. అంతకుముందు అండర్ 19 నెగ్గిన టీమ్‌ఇండియాపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. 'క్రికెట్‌తో భారత ప్రతిభ ప్రకాశిస్తోంది. వరల్డ్?కప్ నెగ్గిన అండర్ 19 జట్టు పట్ల గర్వంగా ఉంది. మన యువ జట్టు టోర్నమెంట్ ఆసాంతం అద్భుతంగా ఆడి, అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఈ విజయం చాలా మంది యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది' అని మోదీ ట్వీట్ చేశారు. ఈ టోర్నీని అత్యధిక సార్లు నెగ్గిన జట్టుగానూ భారత్ టాప్?లో ఉంది. 2000 సంవత్సరంలో టీమ్‌ఇండియా తొలిసారి అండర్ 19 విజేతగా నిలిచింది. ఆ తర్వాత విరాట్ కోహ్లీ నాయకత్వంలో 2008, ఉన్ముక్త్ చంద్ కెప్టెన్సీలో 2012, పృథ్వీ షా సారథ్యంలో 2018లో టైటిల్ నెగ్గింది. ఆ తర్వాత 2022లో యశ్ ధుల్ కెప్టెన్సీలో బరిలో దిగిన భారత్ విజేతగా నిలిచింది. ఇప్పుడు ఆయుశ్ కూడా ఈ ఎలైట్ లిస్ట్‌లో చేరిపోయాడు.

# స్కాట్లాండ్‌పై వెస్టిండీస్ విజయం




**బలగం టీవీ, కోల్‌కతా**

కోల్‌కతాలో జరిగిన టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో స్కాట్లాండ్?పై 35 పరుగుల తేడాతో వెస్టిండీస్? విజయం సాధించింది. 183 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ ఆటలో తడబడి 147 (18.5 ఓవర్లు) పరుగులకే ఆలౌటైంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ పోరులో వెస్టిండీస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. తొలుత బ్యాటింగ్‌లో షిమ్రాన్ హెట్మెయర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, అనంతరం బౌలింగ్‌లో రోమారియో షెపర్డ్ హ్యాట్రిక్‌తో స్కాట్లాండ్‌ను కుప్పకూల్చాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. షిమ్రాన్ హెట్మెయర్ కేవలం 36 బంతుల్లో 64 పరుగులతో (6 సిక్సర్లు, 2 ఫోర్లు) విరుచుకుపడగా, బ్రాండన్ కింగ్ (35), షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (26) కీలక పరుగులు జోడించారు. ముఖ్యంగా హెట్మెయర్ కేవలం 22 బంతుల్లోనే అర్ధశతకం బాది, టీ20 వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ తరఫున అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ రికార్డును నెలకొల్పాడు. 183 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ జట్టులో కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (42), టామ్ బ్రూస్ (35) పోరాడినప్పటికీ, మిగతా వారు విఫలమయ్యారు. 17వ ఓవర్లో రోమారియో షెపర్డ్ వరుసగా మాథ్యూ క్రాస్, మైఖేల్ లీస్క్, ఆలివర్ డేవిడ్సన్‌లను ఔట్? చేసి హ్యాట్రిక్ సాధించాడు. అదే ఓవర్లో మరో వికెట్ కూడా తీసి మొత్తం 5 వికెట్లతో (5/20) స్కాట్లాండ్ నడ్డి విరిచాడు. దీనితో స్కాట్లాండ్ 18.5 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌట్ అయింది. జేసన్ హోల్డర్ 3 వికెట్లు పడగొట్టి, వెస్టిండీస్ తరఫున 100 టీ20 వికెట్లు తీసిన మొదటి బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న షిమ్రాన్ హెట్మెయర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో వెస్టిండీస్ గ్రూప్-సి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లి, సూపర్-8 దిశగా బలమైన అడుగు వేసింది.




## పోరాడి ఓడిన నెదర్లాండ్స్..

- ఉత్కంఠ పోరులో పాక్ విజయం !

**బలగం టీవీ, కొలంబో**

టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన గ్రూప్ స్టేజీ మ్యాచ్‌లో పాకిస్థాన్ విజయం సాధించింది. నెదర్లాండ్స్ నిర్దేశించిన 148 పరుగుల లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి మరో మూడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించేసింది. చివరి రెండో ఓవర్లో 29 పరుగుల చేయాల్సి ఉండగా.. ఫహీమ్ అష్రఫ్ (23; 3 సిక్సులు, 2 ఫోర్లు) అద్భుతంగా బ్యాటింగ్ చేసి జట్టును గెలిపించాడు. దాదాపు మ్యాచ్ చేజారిపోయిందని అనుకున్న సమయంలో ఫహీమ్ జట్టును కాపాడాడు. ఓపెనర్లు ఫర్హాన్ (47; 2 సిక్సులు, 4 ఫోర్లు), సెయిమ్ ఆయూబ్ (24; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. అలీ అఘా (12), బాబర్ ఆజమ్ (15), ఉస్మాన్ ఖాన్ (0), షదాబ్ ఖాన్ (8), మహమ్మద్ నవాజ్ (6).. ఇలా బ్యాటింగ్ లైనప్ అంతా పెవీలియన్ కు క్యూ కట్టారు. కానీ చివర్లో ఫహీమ్ చెలరేగడంతో పాక్ లక్ష్యాన్ని ఫినిష్ చేసింది. ఇక నెదర్లాండ్స్ బౌలర్లలో ఆర్యన్ దత్, మీకరిన్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. వాన్ డెన్ మర్వే, వాన్ బీక్, కెలీ క్లెయిన్ చెరో వికెట్ పడగొట్టారు. మొదట బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు 147 పరుగులకే కుప్పకూల్చారు. పవర్ ప్లే ముగిసేసరికి డచ్ జట్టు 50/2 స్కోరుతో ఇన్నింగ్స్ ధాటిగానే ఆరంభించింది. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (37), బాస్ డి లీడ్ (30) బాధ్యతగా ఆడి నాలుగో వికెట్‌కు 40 పరుగులు జోడించారు. 12.1 ఓవర్లలో ఆ జట్టు 100 పరుగుల మైలురాయిని దాటింది. అయితే ఆ తర్వాత పాక్ బౌలర్లు పట్టు బిగించారు. సల్మాన్ మిర్జా 24 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసి నెదర్లాండ్స్ పతనాన్ని శాసించాడు. సైమ్ అయూబ్, మహమ్మద్ నవాజ్, అబ్రార్ అహ్మద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. ముఖ్యంగా చివరి ఓవర్లలో డచ్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు. 105/3 స్థితి నుంచి ఆ జట్టు ఒక్కసారిగా తడబడి 129/7 స్కోరుకు పడిపోయింది. చివరకు 19.5 ఓవర్లలో 147 పరుగులకు నెదర్లాండ్స్ ఆలౌట్ అయ్యింది.

# ప్రణాళిక ప్రకారం ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలి..

- పోలింగ్, కౌంటింగ్ కు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి..
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
- ఆర్డీవోలు, నోడల్, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల మొత్తం ప్రక్రియ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 11 వ తేదీన మున్సిపల్ ఎన్నికల పోలింగ్, 13వ తేదీన కౌంటింగ్ చేయనున్న నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం ఆర్డీవోలు, నోడల్, ఎన్నికల విభాగం అధికారులతో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎన్నికలకు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని తెలిపారు. ఓటర్ స్లిప్పు పంపిణీ చేయాలని సూచించారు. ఈ నెల 10వ తేదీన సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, వేములవాడ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది హాజరు పరిశీలన, వాహనాల పార్కింగ్, ఎన్నికల సామగ్రి పంపిణీ ఇతర పనులకు నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బందికి టిఫిన్, భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని స్పష్టం చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఉంటుందని, పోలింగ్ కేంద్రం బయట ఒక సీసీ కెమెరా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు వెళ్లేందుకు ర్యాంప్, పోలింగ్ అధికారులు, సిబ్బందికి కనీస వసతులు కల్పించాలని సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత సామగ్రి, బ్యాలెట్ పేపర్లు, పీఓ డైరీ ఇతర సామగ్రి సిరిసిల్ల, వేములవాడలో సినారే కళామందిర్లో ఏర్పాటు చేసే రిసెప్షన్ సెంటర్లో అప్పగించాలని వివరించారు. పోలింగ్ కేంద్రం వద్దకు మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ వివరాలు తెలియజేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. బ్యాలెట్ పేపర్ బాక్స్ లు స్ట్రాంగ్ రూంలో భద్రపరచాలని, పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, లోనికి అధికారులు, సిబ్బంది, గుర్తింపు కార్డు ఉన్న ఏజెంట్లు మినహా ఎవరికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కించాలని, తర్వాత మిగితా ఓట్లు లెక్కించాలని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసే వరకూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, నోడల్ అధికారులు శ్రీనివాసాచారి, గీత, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, అధికారులు ప్రవీణ్, మీర్జా ఫసహత్ అలీ బేగ్, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.



## 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

శివాజీ - లయ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 12 నుంచి ఈటీవీ విన్ వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నా సినిమాలో హీరోలే నాకు దేవుళ్లు. వాళ్లను అలానే చూస్తాను. ఈ సినిమాలో లయ కొత్తగా కనిపించనున్నారు. శివాజీ సినిమాను ఎంత ప్రేమిస్తారో అందరికీ తెలిసిందే. 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అందరినీ నవ్విస్తుంది. ఈ ఈవెంట్‌కు పిలవడం కోసం శివాజీ ఫోన్ చేసినప్పుడు ఒక మాట చెప్పాడు. 'ఈసారి జాగ్రత్తగా మట్లాడతాను' అని చెప్పారు. కచ్చితంగా వస్తానన్నాను' అని అనిల్ రావిపూడి అన్నారు. ఈ సినిమా నవ్విస్తుందా.. భయపెడుతుందా? అనగా..నవ్విస్తూ.. భయపెడుతుంది. చివరి వరకూ ఉత్కంఠ ఉంటుందని శివాజీ అన్నాడు. 50ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా నిర్మాతగా మారే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అంటే.. అనిల్ రావిపూడి హీరోగా చేస్తే.. నేను నిర్మాతను అవుతా. ఎందుకంటే అనిల్ మల్టీటాలెంటెడ్ అని కితాబునిచ్చారు. నా కెరీర్ పూర్తయిందని అనుకున్నాను. ఆ సమయంలో ఓటీటీ వచ్చింది. అలా మరోసారి నా కెరీర్ ఊపందుకుంది. నా 30 ఏళ్ల కెరీర్‌లో నేను నటించిన అన్ని సినిమాలు హిట్ అయ్యాయి. 99 శాతం విజయం సాధించాయని శివాజీ అన్నాడు. నేను ఈ పాత్ర గురించి చెప్పినప్పుడు ఇలా ఉంటుందని అనుకోలేదు. తన కుటుంబం కోసం ఏమైనా చేసే పాత్ర ఇది. అందుకే అలా అనిపిస్తుంది. సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టాక మీరు అనుకున్న పాత్రలు రావడం లేదనే బాధ ఏమైనా ఉందా? సక్సెస్ ఉంటే ప్రతి మనిషికి కచ్చితంగా ఎనర్జీ వస్తుంది. ఆడియన్స్‌కు మన నటన నచ్చుతుంది అని అర్థం అవుతుంది.